

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471


తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి బుధవారం 13-05-2026 సంపుటి: 02 సంచిక : 12 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Wednesday 13-05-2026 Volume :02 Issue: 12 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani


రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777

## మధ్యవర్తిగా
# పాక్‌ని నమ్మలేం



తాజా పరిస్థితులపై ట్రంప్ ఆందోళన

- అమెరికా, ఇరాన్ శాంతి చర్చలకు పాక్ వేదిక
- పాక్ వ్యవహారంపై అధికార వర్గాలకు అనుమానాలు
- ఇరాన్ పై మళ్లీ దాడులకే మొగ్గు చూపుతున్న అమెరికా
- తదుపరి కార్యాచరణపై ట్రంప్ సర్కారులో విభేదాలు

**వాషింగ్టన్: మే 12 (నేటి దర్శిని)**

ఇరాన్ – అమెరికా శాంతి చర్చల్లో మధ్యవర్తిగా పాకిస్థాన్ పోషిస్తున్న పాత్రపై అమెరికా ప్రభుత్వ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా దాడుల నుంచి కాపాడేందుకు ఇరాన్ సైనిక విమానాలను తన విమానాశ్రయాలలో నిలిపి ఉంచడానికి పాక్ అనుమతించిందని అమెరికన్ మీడియా కథనాలతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. కుటిల వైఖరిని కలిగిన పాక్ ను ఇక నమ్మడం నమ్మడం సరికాదని ప్రెసిడెంట్ డొనాల్డ్ -మిగతా 2 లో




## తెలంగాణకు 22,
# ఏపీకి 10 టీఎంసీలు


- కృష్ణా జలాలు పంపిణీ చేయాలని కేఆర్ఎంబీ నిర్ణయం
- ఈ నెల 14న మరోసారి సమావేశం

**హైదరాబాద్ మే 12 (నేటి దర్శిని)**

వేసవిలో తాగు నీటి అవసరాలకు గాను తెలంగాణకు 22 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, ఏ రాష్ట్రానికి ఎంత నీరు విడుదల చేయాలనే అంశంపై చర్చించి ఈ వేసవి వాటాలను బోర్డు నిర్ణయించింది. తాగునీటి అవసరాల కోసం -మిగతా 2 లో

## ముందస్తుగానే
# 'నైరుతి'!

- వాతావరణ శాఖ చల్లటి కబురు
- ఈ వారం చివరి నాటికి అండమాన్‌కు: ఐఎండీ



**న్యూఢిల్లీ, మే 12 (నేటి దర్శిని)**

: దేశ ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. నైరుతి రుతు పవనాలు ఈ వారం చివరినాటికి బంగాళాఖాతం , అండమాన్, నికోబార్ సమీప ద్వీపాలకు చేరుకుంటాయని తెలిపింది. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. సాధారణంగా మే 20 నాటికి అండమాన్, నికోబార్ దీవులకు చేరుకుంటాయి. అనంతరం దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. జూన్ 1న కేరళను తాకుతాయి. భారత ఉపఖండంలో నాలుగు నెలల వర్షాకాలం ప్రారంభానికి దీనిని సూచికగా భావిస్తారు.




# నీట్ పరీక్ష రద్దు !

- సంచలన నిర్ణయం తీసుకున్న ఎన్టీఏ
- రాజస్థాన్‌లో ప్రశ్నపత్రం లీక్ కావడమే కారణం
- దర్యాప్తు చేస్తున్న సీబీఐ
- ఇప్పటికే పలువురి అరెస్ట్
- త్వరలోనే కొత్త తేదీలో పరీక్ష
- ఎటువంటి అదనపు ఫీజు లేకుండానే పరీక్షకు అనుమతి

**న్యూఢిల్లీ,**

పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో దేశవ్యాప్తంగా వైద్య విద్యా ప్రవేశ పరీక్షకు సంబంధించి నీట్ యూజీ 2026 రద్దయ్యింది. మే మూడున నీట్ యూజీ పరీక్ష జరిగింది. ఆ పరీక్షను రద్దు చేయాలని ఎన్టీఏ నిర్ణయం తీసుకుంది. పరీక్ష పేపర్ లీక్‌పై కేంద్రం సీబీఐ దర్యాప్తుకు ఆదేశించింది. పరీక్షకు సంబంధించి కొత్త షెడ్యూల్ త్వరలో విడుదల కానుంది. ఈ మేరకు ఎన్టీఏ ఒక ప్రకటన విడుదల చేసింది. వైద్య విద్యకు సంబంధించి దేశవ్యాప్తంగా మే నెల మూడున నీట్ 2026 ప్రవేశ పరీక్ష జరిగింది. ఆ పరీక్షకు సంబంధించి రాజస్థాన్‌లో ప్రశ్నపత్రం లీక్ అయినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఏ కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ ఎగ్జామ్ -మిగతా 2 లో

# బేటా భగావో .. బేటా బచావో

## తెలంగాణలో ఇదే ప్రస్తుత స్లోగన్

- పోక్సో కేసులో భగీరథ్ ను అరెస్ట్ చేయకపోవడంపై కేటీఆర్ ఆగ్రహం
- ఇంతకీ భగీరథ్ పరారీలో ఉన్నాడా అంటూ పోలీసులకు ప్రశ్న



**హైదరాబాద్, మే 12 (నేటి దర్శిని)**

బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి.. పోక్సో కేసులో ఇరుక్కున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ ను పోలీసులు ఇంకా అరెస్టు చేయకపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని -మిగతా 2 లో

## అమృత్ కాలం కాదు..
# విష యుగం!

- నీట్ పేపర్ లీకేజీపై ప్రతిపక్షాల ఆగ్రహం



**హైదరాబాద్,**

నీట్-యూజీ పరీక్ష రద్దుపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. నీట్ లీకేజీ దేశ యువతపై జరిగిన నేరమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రంపై మండిపడ్డారు. ప్రధాని మోదీ చెప్తున్న అమృత కాలం.. దేశానికి విష యుగంగా మారిందన్నారు.డీఎంకే చీఫ్ స్టాలి న్ స్పందిస్తూ.. నిర్వాహణ ప్రక్రియలో ప్రతి దశలోనూ మోసం కనబడుతున్నదన్నారు. విద్యార్థులు పెద్దయెత్తున -మిగతా 2 లో

## ప్రతి గింజా
# కొనాల్సిందే


### మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ

- కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించం
- రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగనీయద్దు
- క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా కలెక్టర్ల పర్యవేక్షణ ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్ మే 12 (నేటి దర్శిని)**

మిషన్ మోడ్‌లో పనిచేసి రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును -మిగతా 2 లో



## జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల
# రెండో విడత పంపిణీ

- ఆదిలాబాద్‌లో ఆరంభించనున్న ప్రభుత్వం
- నియోజక వర్గం యూనిట్ గా స్థలాల గుర్తింపు
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుపై స్పెషల్ డ్రైవ్
- హైదరాబాద్‌లో ఇండ్ల స్థలాలు కలిగిన వారికి ఇళ్ల మంజూరు పత్రాలు
- అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సహించం
- ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్ మే 12 (నేటి దర్శిని)**

రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఏ.రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లా వారీగా ప్రజా ప్రతినిధులతో -మిగతా 2 లో



## పాస్‌పోర్ట్ సూచీలో
# దిగజారిన భారత్

- 3 ర్యాంకులు పతనమై 78వ స్థానం
- 2006లో 71వ ర్యాంకు

**న్యూఢిల్లీ**

మోదీ హయాంలో పలు కీలక అంతర్జాతీయ సూచీల్లో భారత్ దిగజారుతున్నది. తాజాగా హెన్లీ పాస్‌పోర్టు సూచీలో భారత్ మూడు ర్యాంకులు క్షీణించి 78వ స్థానానికి చేరుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన ఇదివరకటి సూచీలో భారత్ 75వ స్థానంలో ఉంది. అంతర్జాతీయ విమాన రవాణా సంఘం(ఐఏటీఏ) నుంచి సేకరించిన డాటా ఆధారంగా రూపొందించే ఈ సూచీ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు వీసా లేకుండా ప్రవేశం కల్పించే సామర్థ్యం ఆధారంగా పాస్‌పోర్టులకు ర్యాంకులను ఇస్తుంది.192 గమ్యస్థానాలకు వీసారహిత ప్రవేశం కల్పిస్తూ సింగపూర్ ప్రపంచ పాస్‌పోర్టు ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉంది. దాని తర్వాత యూఏఈ, -మిగతా 2 లో

## 15 నుంచి మోదీ..
# విదేశీ పర్యటన

- ఐదు దేశాల్లో పర్యటించనున్న పీఎం
- యూఏఈ నుంచి ఇటలీ వరకు..
- ఆయా దేశాల అధినేతలతో కీలక చర్చలు



**న్యూఢిల్లీ, మే 12 (నేటి దర్శిని)**

అంతర్జాతీయ వేదికపై భారత్ దౌత్య పటిమను చాటేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరు రోజుల పాటు ఐదు కీలక దేశాల్లో పర్యటించనున్నారు. ఈ నెల 15వ తేదీన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తో ప్రారంభమయ్యే ఈ పర్యటన నెదర్లాండ్స్, -మిగతా 2 లో

## అసోం సీఎంగా
# హిమంత బిశ్వశర్మ ప్రమాణం

- వరుసగా రెండోసారి..
- ఆయనతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం
- హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా, చంద్రబాబు
- వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ-ఎన్డీయే కూటమి



**గౌహతి, మే 12 (నేటి దర్శిని)**

అసోంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గువాహటిలోని ఖానాపారాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి -మిగతా 2 లో

### 15 నుంచి మోదీ..
# విదేశీ పర్యటన

మొదటి తరువాయి

స్వీడన్, నార్వేల మీదుగా సాగి లిమే 20వ తేదీన ఇటలీలిలో ముగియనుంది.
ముందస్తు ప్రణాళికలు:
మొదట యూఏఈ: ఈ నెల 15వ తేదీన యూఏఈ అధ్యక్షుడిని కలిసి ఇంధన సహకారం, వాణిజ్యం, భారతీయ సమాజ సంక్షేమంపై చర్చించనున్నారు.
ఆ తర్వాత స్వీడన్: మే 17న స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో పర్యటించి గ్రీన్ ట్రాన్సిషన్, స్పేస్, రక్షణ రంగాల్లో చర్చలు జరుపుతారు.
నెదర్లాండ్స్‌లో టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్: మే 17 వరకు అక్కడే ఉండి రక్షణ, గ్రీన్ హైడ్రోజన్, సెమీకండక్టర్లు మరియు నీటి నిర్వహణపై కుదుర్చుకున్న ఒప్పందాలను సమీక్షిస్తారు.
నార్వేలో ఇండియా-నార్డిక్ సమ్మిట్: 43 ఏళ్ల తర్వాత భారత ప్రధాని నార్వే వెళ్లడం ఇదే తొలిసారి. మే 18న నార్వే రాజుతో పాటు ప్రధానితో దౌత్యపరమైన చర్చలు జరిపి, 3వ భారత్-నార్డిక్ సమ్మిట్‌లో పాల్గొంటారు.
చివరి దశలో ఇటలీ పర్యటన: మే 20న ఇటలీ చేరుకుని ప్రధాని జార్జియా మెలోనీతో కలిసి 'జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 2025-2029' అమలుపై సమీక్ష నిర్వహిస్తారు.
మొత్తానికి ఐరోపా దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో, ఈ పర్యటన భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ ప్రమాణం

మొదటి తరువాయి

చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. సీఎంగా హిమంత బిశ్వ శర్మతో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు.
అసోం సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న శర్మ, ప్రమాణం చేస్తున్న సమయంలో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హిమంతతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో కేంద్ర మాజీ మంత్రి రామేశ్వర్ తేలి, అసోం గణ పరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) నేత చరణ్ బోరో, సీనియర్ బీజేపీ నేత అజంత నియోగ్ ఉన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్‌తో పాటు 22 ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు హాజరయ్యారు. వీరితో పాటు అస్సాంలోని వైష్ణవ మతాలకు చెందిన 15 మంది సత్రాధికారులు వంటి ప్రముఖ మత పెద్దలు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.
బీజేపీ రాజకీయ ఆధిపత్యం సుస్థిరం
ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి స్పష్టమైన ఆధిక్యంతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఎన్డీయే బృందానికి 102 సీట్లు వచ్చాయి. అసోం అసెంబ్లీలో 126 మంది సభ్యులు ఉండగా, దాంట్లో బీజేపీ 82 స్థానాలను చేజిక్కించుకున్నది. ఏజీపీ, యూపీపీఎల్ పార్టీలు చేరి పది సీట్లు గెలుచుకున్నాయి. దీంతో హిమంత బిశ్వ శర్మ రెండోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఆయన తొలిసారిగా 2021లో సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాయకత్వంలో బీజేపీ ఈశాన్య రాష్ట్రమైన అసోంలో తన రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ప్రమాణ స్వీకారానికి ముందు బీజేపీ, ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా హిమంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### పాస్‌పోర్ట్ సూచీలో
# దిగజారిన భారత్

మొదటి తరువాయి

దక్షిణ కొరియా, జపాన్ ఉన్నాయి.
**2006లో 71వ ర్యాంకు**
భారత పాస్‌పోర్టు 2006లో 71వ ర్యాంకుతో తన అత్యున్నత స్థాయికి చేరుకుంది. ఇప్పుడు ఇది బుర్కినా ఫాసో, క్యూబా, సెనెగల్‌తో కలిసి 78వ స్థానాన్ని పంచుకుంటున్నది. హెన్లీ పాస్‌పోర్టు సూచీ ప్రపంచవ్యాప్తంగా 199 దేశాలను మూల్యాంకనం చేస్తుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారత పాస్‌పోర్టు బలహీనపడి ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

# బేటా భగావో .. బేటా బచావో

మొదటి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బేటీ బచావో - బేటీ పడావో అనేది ఒరిజినల్ స్లోగన్ అయినప్పటికీ ఇప్పుడు కొత్త నినాదం తెరమీదకు వచ్చిందని తెలిపారు. బేటా భగావో - బేటా బచావో అనే నినాదాన్ని బీజేపీ, కాంగ్రెస్ పాటిస్తున్నాయని మండిపడ్డారు. వెల్ డన్ కాంగ్రెస్ అండ్ బీజేపీ అని వ్యాఖ్యానించారు.
అంతకుముందు ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితునిగా ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ను పోలీసులు అరెస్టు చేయకపోవడంపై పలు రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ రితిరాజ్ గైక్వాడ్ మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులు ఆయన కాల్ డేటాను సేకరిస్తున్నారని, దొరకగానే పట్టుకుంటామని తెలిపారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'కేంద్ర హోంమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడా? దేశ చరిత్రలో ఇదే మొదటి సారా?' అని ప్రశ్నించారు.

# అమృత్ కాలం కాదు.. విష యుగం!

మొదటి తరువాయి

ఉద్యమించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. పరీక్షను పూర్తిగా రద్దు చేయాలని ఆర్జేడీ డిమాండ్ చేసింది. పేపర్ లీకేజీలతో పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వసనీయత దెబ్బతింటున్నదని సీపీ ఎం ఆందోళన వ్యక్తం చేసింది.

# తెలంగాణకు 22, ఏపీకి 10 టీఎంసీలు

మొదటి తరువాయి

నాగార్జునసాగర్ నుంచి 10 టీఎంసీలు ఏపీకి, తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 5 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతిచ్చింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలిపిన తెలంగాణ, సాగర్‌లో ఏపీకి 10 టీఎంసీలు పోగా మిగిలిన మొత్తం నీరు తమకే చెందుతుందని వాదించింది. తాగునీటి అవసరాల కోసం నీటిని అడుగుతున్నట్టు ఏపీ ఈఎన్సీ తెలిపారు. మిగతా అంశాలు కాకుండా అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకుందామని బోర్డు సభ్య కార్యదర్శి తెలిపారు. దాంతో రెండు రాష్ట్రాలు బోర్డు నిర్ణయాన్ని అంగీకరించారు. కాగా తమకు 18 టీఎంసీలు కావాలని తెలంగాణ అభ్యర్థించగా, మరో మూడు టీఎసీలు అదనంగా కేటాయించడం గమనార్హం. ఈ ఒప్పందం ఆగస్టు 15 వరకు అమల్లో ఉంటుందని కేఆర్ఎంబీ వర్గాలు తెలిపారు. ఈ నెల 14న కేఆర్ఎంబీ 21వ సమావేశం జరగనుంది. కృష్ణానది నీటి వాటాలు, శ్రీశైలం, నాగార్జున సాగర్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజు, తెలంగాణ, ఏపీలకు చెందిన ఈఎన్సీలు రమేశ్‌బాబు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

# ప్రతి గింజా కొనాల్సిందే

మొదటి తరువాయి

పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచి కాంట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు కూడా వెనకాడొద్దన్నారు.
ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో గోడౌన్స్ సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరానిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
అకాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ
అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలని, వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రతి ఐకేపీవీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తూకం, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అద్దంకి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, శాంతికుమారిలు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష రద్దు !

మొదటి తరువాయి

రద్దు చేస్తున్నట్లు ప్రకటన చేసింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జాతీయ పరీక్షా వ్యవస్థ పారదర్శకతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.
లోతుగా దర్యాప్తు
కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రాథమిక సమాచారం మేరకు నీట్ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు తేలింది. ఈ నేపథ్యంలో ఎన్టీఏ కఠిన నిర్ణయం తీసుకుంది. రాజస్థాన్‌లో పరీక్షకు ముందే పేపర్ ఎలా సర్క్యులేట్ అయింది? దీనివెనుక ఏమైనా మూలాలు ఉన్నాయా? అన్నకోణంలో లోతుగా దర్యాప్తు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. విచారణకు అవసరమైన అన్ని రికార్డులను సీబీఐకి అందజేస్తామని ఎన్టీఏ పేర్కొంది. మే మూడున నీట్ యూజీ 2026 పరీక్ష కెమిస్ట్రీలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును రాజస్థాన్ పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సల్, ఎస్ఓజీ అధికారులు స్వయంగా వెల్లడించారు. పరీక్షకు 42 గంటల ముందు ఆ పేపర్ రాజస్థాన్‌లోని సికార్‌లో వాట్సాప్ నుంచి వచ్చినట్లు గుర్తించారు.
కేరళ ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా..
నీట్ ప్రశ్నపత్రంలో 600 మార్కుల ప్రశ్నలతో ఆ పేపర్ పోలి ఉంది. కొన్ని ప్రశ్నలు ఒకేలా ఉండటం పలు అనుమానాలు మొదలయ్యాయి. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. సదరు వ్యక్తి ఈనెల ఒకటిన సికార్‌లోని తన ఫ్రెండ్‌కి దానికి సంబంధించిన మెటీరియల్ ఇచ్చాడని తెలుస్తోంది. ఆ పేపర్ కాస్తా కోచింగ్ నెట్‌వర్కులు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరింది. అందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించి 300లకు ప్రశ్నలు చేతి రాతతో ఉన్నట్లు తెలిసింది. ఆ పేపర్ ఇచ్చినందుకు విద్యార్థుల నుంచి రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు పోలీసులు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత పంపిణీ

మొదటి తరువాయి

నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మంగళవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్ కుమార్ రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2బీహెచ్ కే ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనలో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్ భూములు, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్ల శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

# మధ్యవర్తిగా పాక్‌ని నమ్మలేం


మొదటి తరువాయి

ట్రంప్ కు సన్నిహితులైన కొందరు ముఖ్య నేతలు అభిప్రాయపడ్డారంటూ మరొక అమెరికన్ మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. శాంతి చర్చల స్థితిపై దేశాధ్యక్షుడు ట్రంప్ అసంతృప్తిగా ఉన్నారనే విషయాన్ని ఇరాన్ ను పాకిస్థాన్ తెలియాజేస్తోందా లేదా అనే దానిపై ఇప్పుడు అమెరికా ప్రభుత్వ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపింది.
ఇరాన్ తరపున సానుకూలంగా పాక్ ప్రజెంటేషన్
ఇరాన్ వైఖరి గురించి అమెరికాకు ఉన్నది ఉన్నట్లుగా చెప్పకుండా, దాన్ని పూర్తి సానుకూల కోణంలో పాకిస్థాన్ ప్రజెంట్ చేస్తోందనే భావనకు ట్రంప్ సర్కారులోని కొందరు అధికారులు వచ్చారని కథనం పేర్కొంది. పాక్ ఈ విధంగా చేస్తున్నందు వల్లే శాంతి చర్చలపై అమెరికా అధికారులు చేస్తున్న ప్రకటనలకు, ఇరాన్ పక్షం తీసుకుంటున్న వైఖరులకు మధ్య తేడాలు ఉంటున్నాయని చెప్పింది. తమ ఎదుట కూడా చైనానే అడ్డున్నట్లు సోమవారం రోజు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెషియాన్ చేసిన ప్రకటన సైతం ఇందుకు సాక్ష్యంగా నిలిచింది. తమ దేశ సైనిక శక్తికి, జాతీయ ప్రయోజనాలకు మద్దతుగా ఉండే చర్యలకే ప్రాధాన్యత ఇస్తామని ఆయన తేల్చి చెప్పడం గమనార్హం. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ, అమెరికా - ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పుడు వెండిలేటర్ పై ఉందని ప్రకటించారు. ఇరాన్ గతంలో ఎన్నడూ లేనంత బలహీనంగా ఉందని, ఆ దేశ ప్రతిపాదన చెత్త ముక్కతో సమానమని అది అమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.



ఇరాన్ పంపిన చెత్తను పూర్తిగా చదవలేదని, మొత్తం మీద వాళ్లు (ఇరాన్) వెండిలేటర్ పై ఉన్నారని ట్రంప్ హెచ్చరించారు. కాల్పుల విరమణ కాలంలో ఇరాన్ నిర్మించుకున్న కొద్దిపాటి బలన్నైనా అమెరికా ఒక్క రోజులోనే నాశనం చేస్తుందన్నారు.
ఇరాన్ పై మళ్ళీ దాడులకే ట్రంప్ మొగ్గు?
చర్చల వేళ ఇరాన్ ప్రదర్శించిన మొండి వైఖరిపై ప్రెసిడెంట్ ట్రంప్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారంటూ ఓ అమెరికన్ మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ఈ పరిస్థితుల్లో మళ్లీ ఇరాన్ పై వైమానిక దాడులను ప్రారంభించే ప్రతిపాదనను ఆయన పరిశీలించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. ఇప్పటికే హార్ముజ్ జలసంధిని ఇరానే నియంత్రిస్తుండటం పైనా ట్రంప్ అసహనంతో ఉన్నారని పేర్కొంది. ఇరాన్ లోని అతివాద నేతలే శాంతి చర్చలకు అడ్డు తగులుతున్నారనే అభిప్రాయాన్ని అమెరికా ప్రెసిడెంట్ పునరుద్ఘాటించారని కథనంలో ప్రస్తావించారు. ప్రస్తుతం ఇరాన్ వ్యక్తం చేస్తున్న వైఖరిని బట్టి, ఆ దేశానికి చర్చలపై అసలు ఆసక్తి ఉందా అనే ప్రశ్న అమెరికా ప్రభుత్వ వర్గాల్లో ఉదయిస్తోందని తెలిపారు.
ట్రంప్ సర్కారులోనూ విభేదాలు:
అమెరికన్ మీడియా కథనం ప్రకారం, తదుపరి కార్యాచరణ విషయంలో ట్రంప్ సర్కారులోనూ విభేదాలు తలెత్తాయి. తీవ్రమైన సైనిక చర్య ద్వారా ఇరాన్ ను తొలుత బలహీనపరచాలని రక్షణ శాఖలోని పలువురు అధికారులతో పాటు ఇంకొందరు కీలక నేతలు ట్రంప్ కు సూచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్ తో చర్చలను ఇంకొంత కాలం పాటు కొనసాగించడం మంచిదని ఇంకొందరు ముఖ్య నేతలు ట్రంప్ కు సలహా ఇస్తున్నట్లు తెలుస్తోంది. చాలా దశాబ్దాలుగా ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొని నిలబడిన ఇరాన్, అమెరికా సర్కారు ఆలోచించినంత అత్యవసరంగా పరిష్కారాన్ని కోరుకునే అవకాశాలు ఉండవని ట్రంప్ సర్కారులోని ఇంకొందరు నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది.

# జడ్చర్ల అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యేకు లేదు



మిడ్జిల్ మండల అధ్యక్షుడు . టి. అల్వాల్ రెడ్డి మాట్లాడుతూ



మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్టంపల్లి మల్లిఖార్జున్ రెడ్డి మాట్లాడుతూ...

- **మిడ్జిల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తంగేళ్ల ఆల్వాల్ రెడ్డి**
- **జడ్చర్లకు భారీ నిధులు తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిదే**
- **ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి నాయకత్వంలో జడ్చర్ల అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది**

**మిడ్జిల్, మే12 (నేటి దర్శిని ప్రతినిధి):** టిఆర్ఎస్/బిఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశాలు నిర్వహిస్తూ జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తంగేళ్ల ఆల్వాల్ రెడ్డి హెచ్చరించారు. జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యేకు లేదని విమర్శించారు.గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. పేదలకు కనీసం ఇళ్లు ఇవ్వలేని ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమని, పెళ్లి అయిన నూతన దంపతులకు కూడా రేషన్ కార్డులు మంజూరు చేయలేని పరిస్థితి నెలకొల్పిందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే జడ్చర్ల అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా భూదందాలు, భూ కబ్జాలు, అక్రమ వ్యవహారాలపైనే శ్రద్ధ పెట్టారని ఆరోపించారు. మిడ్జిల్ గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో రూ.45 లక్షల అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై పూర్తి విచారణ చేస్తామని డిమాండ్ చేశారు. త్వరలోనే పూర్తి ఆధారాలతో బిఆర్ఎస్ నాయకుల బాగోతాన్ని ప్రజల ముందుంచుతామని స్పష్టం చేశారు. జడ్చర్ల మున్సిపాలిటీలో గత పదేళ్లలో కనీస డ్రైనేజీ వ్యవస్థను కూడా పూర్తి చేయలేని అసమర్థ నాయకత్వం బిఆర్ఎస్‌దేనని అన్నారు.



మాజీ ఎమ్మెల్యే ఒకరోజైనా జడ్చర్ల అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రిని కలిసిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి గారు నిరంతరం ముఖ్యమంత్రి, మంత్రులతో సమన్వయం చేసుకుంటూ జడ్చర్ల నియోజకవర్గానికి భారీ స్థాయిలో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని తెలిపారు. విద్య, విద్యుత్, రహదారులు, సంక్షేమం, మౌలిక వసతుల రంగాల్లో జడ్చర్లను ముందుకు తీసుకెళ్తున్న ఘనత ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి దేనన్నారు. అదేవిధంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆల్వాల్ రెడ్డిపై బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. పూర్తి ఆధారాలు ఉంటే ప్రజల ముందుకు తీసుకురావాలని, చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు.

**రెండేళ్లలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సాధించిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలు**

నియోజకవర్గంలో 21 కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్లు, ఒక 132/33 కేవీ సబ్ స్టేషన్ మంజూరు బాలానగర్ మండలం పెద్దాయిపల్లిలో నవోదయ పాఠశాల మంజూరు ఉదండాపూర్ నిర్వాసితులకు పరిహారం పెంపు బాలానగర్ మండలంలో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ పాఠశాల మంజూరు మహబూబ్‌నగర్ జిల్లాకు ఐఐఐటీ విద్యాసంస్థ మంజూరు జడ్చర్ల పట్టణంలో స్టార్మ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణాలకు భారీ నిధులు గ్రామాలు, తాండాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పేదలకు తెల్ల రేషన్ కార్డుల పంపిణీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం గ్రామీణ రహదారుల అభివృద్ధి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అన్ని గ్రామపంచాయతీలకు రూ.5 లక్షల నిధుల మంజూరు అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్ల మంజూరుకు చర్యలు

**బిఆర్ఎస్ నాయకుల పాలనలో జరిగిన అక్రమాలు**

కొత్తపల్లి కేంద్రంగా ఇసుక అక్రమ వ్యాపారం జడ్చర్లలో భూకబ్జాలు మిడ్జిల్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో రూ.45 లక్షల అవినీతి ఆరోపణలు పేదలకు ఇళ్లు ఇస్తామని మోసం దళిత బంధు పేరుతో దళితులను మోసం మూడు ఎకరాల భూమి హామీ అమలు చేయకపోవడం దళిత ముఖ్యమంత్రి హామీ విస్మరణ అక్రమ సంపాదన, రియల్టర్ల బెదిరింపుల రాజకీయాలు

**కాంగ్రెస్ పాలనలో మిడ్జిల్ ప్రాంత అభివృద్ధి**

జూనియర్ కళాశాల ఏర్పాటు తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం కేజీబీవీ ఏర్పాటు 132/33 కేవీ సబ్ స్టేషన్ మంజూరు యునాని ఆసుపత్రి నిర్మాణం, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం, ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూస్, యూనిఫాంల పంపిణీ. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు మార్కెట్ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గూటికి చేరనున్న ఆకుతోటపల్లి సర్పంచ్ నరేందర్ రెడ్డి...



**ఆమనగల్లు,మే12(నేటి దర్శిని);** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆమనగల్లు మండలం లోని ఆకుతోటపల్లి గ్రామ సర్పంచ్ నేలపట్ల నరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.సుమారు 400 మందితో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు రాబోయే రోజుల్లో మండలంలోని ఆకుతోటపల్లి గ్రామ అభివృద్ధి కై,కావలసిన నిధుల కొరకై, అలాగే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సర్పంచ్ నరేందర్ రెడ్డి తెలిపారు.

## కల్వకుంట్ల కవిత నోరు అదుపులో పెట్టుకో...

- **మాజీ సర్పంచ్ లు విజయ్ కుమార్ రెడ్డి,వెంకటయ్య...**



**తలకొండపల్లి,మే12(నేటి దర్శిని);** కవిత నోరు అదుపులో పెట్టుకోవాలని చంద్రధన మాజీ సర్పంచ్ విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కల్వకుంట్ల కవిత వైఖరిని బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు, అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. హరీష్ రావు ప్రజల కోసం నిరంతరం సేవలందించిన నాయకుడని, ఆయనపై అసత్య ఆరోపణలు చేయడం తగదని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం పాటించడం ప్రతి నాయకుడి బాధ్యత అని సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమయంలో వ్యక్తిగత విమర్శలకు దిగడం ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతిని దిగజార్చే ప్రయత్నమని నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే నాయకులను అవమానించే వ్యాఖ్యలను ప్రజలు ఎప్పటికీ సమర్థించారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచులు బోసు వెంకటయ్యయాదవ్, విజయ్ కుమార్ రెడ్డి, లింగం గౌడ్,కెంచ రమేష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుద్దేటి మహేష్ నేత,బాలు నాయక్,బీమా, రమేష్ ,హేమ్లాల్ ,చత్రు, తదితరులు పాల్గొన్నారు

## పందుల బెడదను నివారించాలని మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేత...



**ఆమనగల్లు,మే12(నేటి దర్శిని);** ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ లో పందుల బెడదను నివారించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, ఎస్సై సీతారాం రెడ్డికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ విజ్ఞప్తి చేశారు. పందుల బెడదతో కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన ధాన్యానికి నష్టం వాటిల్లుతున్నట్లు వారు వివరించారు.రైతుల ఇబ్బందుల దృష్ట్యా చర్యలను తీసుకుని పందుల బెడదను నివారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్ల రవీందర్,రాఘవేందర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

- **పంచముఖి హనుమాన్ దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**

**హయత్‌నగర్, మే 12 (నేటి దర్శిని):** హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదా నగర్ పంచముఖి హనుమాన్ దేవాలయంలో కాలనీవాసులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో కలిసి శ్రీ ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ ప్రజలందరి సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ హనుమాన్



జన్మదినోత్సవం భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, భక్తి మరియు సేవా తత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆంజనేయ స్వామివారి ఆదర్శాలను అనుసరించి ధర్మ పరిరక్షణ, సమాజ సేవ, దేశభక్తి మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాలనీ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉమ్మడి డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు అప్పారావు, ప్రధాన కార్యదర్శి గోవింద్ చారి, నాయకులు మధుసూదన్, ఎర్ర శ్రీకాంత్, కాలనీ అధ్యక్షులు ప్రదీప్, దేవాలయ కమిటీ అధ్యక్షులు భగవాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ స్థానిక నాయకులు, భక్తులు, కాలనీవాసులు భారీ సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆమనగల్లు సిహెచ్ సి లో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం...

**ఆమనగల్లు,మే12(నేటి దర్శిని);** ఆమనగల్ సిహెచ్ సిలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆమనగల్లు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో మంగళవారం వైద్యాధికారుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సిహెచ్ సి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని అంతర్జాతీయ నర్సుల



దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్యరంగంలో నర్సింగ్ సర్వీసెస్ కేటగిరిలో ఉత్తమ సేవలందించిన హెడ్ నర్సులకు,నర్సింగ్ ఆఫీసర్లకు డాక్టర్ నాగరాజు కేక్ కట్ చేసి శాలువాలతో ఘనంగా వారిని సత్కరించి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రోగులను కంటికి రెప్పలా కాపాడుతూ వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించే నర్సుల అంకితభావం,నిబద్ధత, నిస్వార్థసేవలు అభినందనీయం. ఆరోగ్య రంగానికి వెన్నెముకగా నిలుస్తూ అచంచలమైన సేవాభావంతో వారు అందిస్తున్న అలుపెరుగని సేవలు అనన్య సామాన్యమని వైద్యాధికారి నాగరాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి, నర్సింగ్ సిబ్బంది,హెడ్ నర్స్ యేసుమని,రత్నజ్యోతి,ఎక్సీ బాసు, నీత,అలివేలు, సాయిలత,కృష్ణ లీల,సంపూర్ణ, రేణుక,మధు,సత్య, మునిర,పూజ,ల్యాబ్ టెక్నీషియన్ వేణు, జూనియర్ అసిస్టెంట్ సాయి,వైద్య సిబ్బంది గుజ్జరి శ్రీను, కలమ్మ ,సురేష్,ఆనంద్,పవన్,మంగ శారద,శాంతి, సుశీల,అంజమ్మ, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్ పై తక్షణ చర్యలు తీసుకోవాలి

- **బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంజి కృష్ణ**



మిడ్జిల్ మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంజి. కృష్ణ

**మిడ్జిల్, మే 12, ( నేటి దర్శిని ప్రతినిధి):** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసులో బీజేపీ నాయకులు మౌనం విడిచి వెంటనే స్పందించాలని నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మిడ్జిల్ మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంజి కృష్ణ డిమాండ్ చేశారు,మైనర్ బాలికకు మద్యం త్రాగించి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసు అత్యంత తీవ్రమైనదని, ఇలాంటి ఘటనల్లో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా చట్టం తన పని తాను చేసుకోపోతుందని అన్నారు. బాధితురాలికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పోక్సో వంటి తీవ్రమైన కేసుల్లో ఆలస్యం చేయడం సమాజానికి తప్పు సంకేతాలు పంపినట్టేనని, నిందితుడు ఎవరైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని ప్రభుత్వం నిరూపించాలని పేర్కొన్నారు. అలాగే ఈ కేసులో నిజాలు వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీపడకూడదని ఆయన అన్నారు.

# సంపాదకీయం


## దెబ్బమీద దెబ్బ




ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న వేళ.. ఎరువుల కంపెనీలు అదను చూసి రైతులను దెబ్బకొట్టాయి. అమెరికా- ఇరాన్ యుద్ధం వల్ల ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయంటూ దేశంలోని ఎరువుల కంపెనీలు ధరలను భారీగా పెంచేశాయి. ఈ ధరలు తక్షణం అమల్లోకొస్తాయని తెలిపాయి. అంతర్జాతీయంగా గ్యాస్, చమురు, ముడి సరుకుల ధరల పెరుగుదల, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను సాకుగా చూపి సబ్సిడీ పెంచాలని కంపెనీలు కేంద్రాన్ని కోరాయి. కానీ, సబ్సిడీ పెంపునకు అంగీకరించకుండా కంపెనీలే ధరలు పెంచుకోవడానికి మోడీ సర్కార్ అనుమతినిచ్చింది. అంతర్జాతీయంగా ఇలాంటి విపత్తులు ఎదురైనప్పుడు కేంద్రమే ఆ భారాన్ని భరించి రైతులపై పడకుండా చూడాలి. కానీ, కంపెనీలకే ఆ అధికారాన్ని అప్పగించడం ద్వారా ఈ ప్రభుత్వం రైతులపక్ష?ం కాదు, కార్పొరేట్ పక్ష?మేనని మరోసారి రుజువైంది. ప్రస్తుతం కాంప్లెక్స్ ఎరువుల ధర యాభై కిలోల బస్తాపై రూ.225 నుంచి 300 వరకు, ఎంఓపీ (పొటాషియం) రేటు బస్తాకు రూ.125 పెరిగింది. ఇలాంటి ప్రభావం ఉన్నప్పుడు ఉత్పత్తి ఖర్చులు పెరిగితే కేంద్రం సబ్సిడీ ఇవ్వాలి. అంతేగాని ధరలు పెంచు కోవడానికి అనుమతి ఇవ్వడమేంటని రైతుసంఘాలు, మేధావుల ప్రశ్న. ప్రపంచ దేశాల్లో రైతు లను, వ్యవసాయాన్ని ఆదుకోవా లంటున్న ఆయా ప్రభుత్వాలు.. మన దేశంలో పాలకులు రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ వారిని సాగుకు దూరం చేస్తున్నాయి. ఇప్పటికే ధర బాగున్నా చీడపీడలతో మిరప దిగుబడులు పతనమయ్యాయి. ఎక్కువ మొత్తంలో మక్కలు దిగుబడులొచ్చినా ధర లేదు. వానాకాలంలో పత్తి, పెసర పంటలు అధిక వర్షాలతో దెబ్బతిన్నాయి. వరి పంట పరిస్థితి అప్పుడు ఇప్పుడూ అదే పరిస్థితి. ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై ఎంతోమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. పంటను అమ్ముకోలేకఎన్ని ఇబ్బందులు పడుతున్నారో చూస్తున్నాం. కుప్పల మీదే ప్రాణాలు విడుస్తున్నారు. ఈ సమయంలో రైతులకు భరోసా కల్పించాల్సిన కేంద్రం ఎరువుల ధరలు పెంచడానికి అనుమతినివ్వడం బాధ్యత నుంచి తప్పుకోవడమే అవుతుంది. వ్యవసాయ రంగంలో విత్తనం తర్వాత అత్యంత కీలకమైనది ఎరువు. ముఖ్యంగా యూరియా, డీఏపీ, పొటాష్, ఎన్పీకే వంటి ఎరువులు లేకుండా సాగు అసాధ్యం. కానీ ఈ ఎరువుల ధరలు ప్రతి ఏడాది పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు పెరిగాయని, దిగుమతి ఖర్చులు అధికమ య్యాయని, ఉత్పత్తి వ్యయం పెరిగిందని కంపెనీలు చెబుతుంటాయి. పైకి కంపెనీలు చెప్పినట్టు కనిపిస్తున్నా.. ప్రభుత్వమే వారి చేత ఈ మాటలు చెప్పిస్తున్నదన్న విమర్శల్ని కొట్టిపారేయలేం. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారాలను తమ మీద వేసుకోవడానికి సిద్ధపడటం లేదు. గ్యాస్ ధరలు పెంచినప్పుడే ఒక్కొక్క దానిపై కేంద్రం భారాలు వేయడానికి సిద్ధమైంది. కాకపోతే రైతుల వ్యతిరేకత తమ వైపునకు రాకుండా జాగ్రత్తలు పడినట్టు అర్థమవుతోంది. యూరియా, డీఏపీలను మినహాయించి మిగతా కాంప్లెక్స్ ధరలు పెంచుకునేందుకు అంగీకారం తెలిపినా, వాటి ధరలు కూడా త్వరలో పెరగడం ఖాయం! ప్రభుత్వాలు రైతును దేశానికి అన్నదాత అని కొనియాడుతుంటాయి. ఎన్నికల సమయంలో రైతు సంక్షేమం గురించి పెద్ద పెద్ద హామీలిస్తాయి. కానీ వాస్తవ పరిస్థితుల్లో రైతుకు అత్యవసరమైన సబ్సిడీలు ఇవ్వడానికి సంకోచిస్తున్నాయి. కంపెనీల లాభాల కోసం రైతు ప్రయోజనాలను పక్కనపెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది లక్షల కోట్ల రూపాయల సబ్సిడీ ఇస్తున్నామని చెప్తున్నా అదంతా ఒక బూటకం. సబ్సిడీ ఎక్కువగా ఎవరికి అందుతున్నదో అందరికీ తెలిసిన విషయమే. సాగు ఖర్చులు మరింత పెరిగితే రైతులు వ్యవసాయం వదిలేయడమేనా? రైతు బలహీనపడితే దేశం బలహీనపడినట్టే అనే విషయాన్ని పాలకులు ఎందుకు గుర్తించడం లేదు? వ్యవసాయరంగం ఇప్పటికే అనేక సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితులతో కుదేలవుతున్నది. అస్థిర మార్కెట్, పంటలు సరైన దిగుబడులు రాకపోవడం, గిట్టుబాటు ధరలు లభించకపోవడం, పెరుగుతున్న సాగు వ్యయం, అప్పులభారం వంటి సమస్యలతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇలాంటి సమయంలో 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు' ఎరువుల ధరలు పెంచుకునేందుకు కంపెనీలకు కేంద్రం అనుమతినివ్వడం అన్యాయం. ఇది భవిష్యత్తులో వ్యవసాయరంగానికి పెద్ద ప్రమాదంగా పరిణమించనుంది. ఎందుకంటే, వ్యవసాయానికి ప్రాణాధారమైన ఎరువుల ధరలు పెంపుదల కేవలం రైతుపైనే కాదు, దేశ ఆహార భద్రతపై కూడా తీవ్రమైన ప్రభావం చూపే నిర్ణయం. ఇప్పటికైనా కంపెనీల లాభాల కంటే రైతు ప్రయోజనాలను కాపాడే విధంగా కేంద్రసర్కార్ వ్యవహరించాలి. లేదంటే రైతుక్ష్?త్రంలో దోషిగా నిలబడక తప్పదు. ?

## కూనో నేషనల్ పార్క్‌లో నాలుగు చీతా కూనల మృతి..

### -వేరే జంతువు దాడి చేసిందా..?



న్యూఢిల్లీ మే 12 (నేటి దర్శిని) మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్క్‌లో నాలుగు చీతా కూనలు మరణించాయి. మంగళవారం ఉదయం వీటి కళేబరాల్ని అధికారులు గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ 4 కూన పిల్లలు కేజీపీ 12 అనే ఆడ చీతాకు చెందినవి. ఇవి గత నెల 11న జన్మించాయి. ఇవి నాలుగూ సోమవారం ఉదయం వరకు ఆరోగ్యంగానే ఉన్నట్లు అధికారులు గుర్తించారు.మంగళవారం పర్యవేక్షకులు ఈ ప్రాంతంలో సాధరణ మానిటరింగ్ నిర్వహిస్తుండగా, నాలుగు కూనల కళేబరాలు కనిపించాయి. వీటిని ఒక జంతువు చంపి తిన్నట్లు ప్రాథమికంగా గర్తించారు. ఈ నాలుగు కళేబరాల్ని వాటి నివాస స్థలం పక్కనే గుర్తించారు. ఈ నాలుగింటి తల్లి క్షేమంగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, నాలుగు కూనలు మరణించిన నేపథ్యంలో ఈ తల్లి చీతా రక్షణ కోసం అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. అలాగే, ఈ చీతాపై మళ్లీ దాడి జరగకుండా భద్రంగా గమనిస్తున్నారు. ఈ చీతా ప్రబర్తన సాధారణంగానే ఉందని అధికారులు అంటున్నారు. నాలుగు చీతాల కళేబరాల్ని అధికారులు పోస్టుమార్టం కోసం తరలించారు. వీటి మృతికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ ప్రాంతంలో నిఘా పెంచారు. వేరే ఏదైనా దాడి చేసే జంతువు ఉందేమో అని గమనిస్తున్నారు. మరో దాడి జరగకుండా చూస్తున్నారు. వరుసగా వివిధ కారణాలతో చీతాలు మరణిస్తున్న నేపథ్యంలో ప్రాజెక్ట్ చీతాపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కూనో నేషనల్ పార్క్ పరిధిలో 50 చీతాలున్నాయి. వీటిలో 33 ఇండియాలోనే జన్మించాయి. మరో మూడు చీతాలు గాంధీ సాగర్ అభయారణ్యంలో ఉన్నాయి. దీంతో దేశంలో ప్రస్తుతం 53 చీతాలున్నాయి.

## నీట్ పరీక్ష ఈ నెల 22 లోపు జరిగే ఛాన్స్..


### -సీబీఐ చేతికి విచారణ




న్యూఢిల్లీ మే 12 (నేటి దర్శిని) నీట్ 2026 పేపర్ లీకవ్వడంతో ఈ పరీక్షను ఎన్‌టీయే (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త పరీక్ష నిర్వహణ తేదీపై సందిగ్ధత నెలకొంది. తాజా సమాచారం ప్రకారం మరోసారి నీట్ 2026 పరీక్షను ఈ నెల 22లోపు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరో వారం లేదా పది రోజుల్లోనే పరీక్ష నిర్వహిస్తామని, దీనికి సంబంధించిన తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఎన్‌టీయే వర్గాలు తెలిపాయి. మరోవైపు ఈ విచారణ ఇప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్త అయిన సీబీఐకి చేరింది. కేసు విచారణను సీబీఐకి అప్పగిస్తూ కేంద్ర నిర్ణయం తీసుకుంది. ఇంతవరకు ఈ కేసును గుజరాత్‌కు చెందిన ఎస్‌వోజీ (స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్) విచారణ జరిపింది. ఈ సంస్థ నుంచి కేసు విచారణను సీబీఐ తీసుకుంది.ఈ కేసులో ఇప్పటివరకు కీలక సూత్రధారులైన మనీష్ యాదవ్, రాకేష్ మాండవీర్యను ఎస్‌వోజీ పోలీసులు అరెస్టు చేశారు. అలాగే, ఒక నీట్ అభ్యర్థి కుటుంబాన్ని కూడా ఎస్‌వోజీ అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నీట్ లీకేజీని విచారించనున్న సీబీఐ.. ఎన్‌టీయే అధికారుల్ని కూడా విచారించనుంది. మే 3న జరిగిన నీట్ పరీక్షకు దేశవ్యాప్తంగా 22.7 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరంతా ఇపుడు మరోసారి పరీక్షకు హాజరు కావాల్సి ఉంది.

## వాటర్ మిలన్ తిని బాలుడు మృతి..

### - మరో ముగ్గురు చిన్నారులు ఆస్పత్రిపాలు



న్యూఢిల్లీ మే 12 (నేటి దర్శిని) చత్తీస్‌గఢ్‌లో విషాదం జరిగింది. వాటర్ మిలన్ తిన్న 15 ఏళ్ల బాలుడు మరణించాడు. మరో ముగ్గురు చిన్నారులు ఆస్పత్రిపాలయ్యారు. ఈ ఘటన జంజ్‌గిర్--చంపా జిల్లాలోని ఘుర్‌కోట్ గ్రామంలో సోమవారం జరిగింది. అధికారుల వివరాల ప్రకారం.. కొంతమంది పిల్లలు కుటుంబంతో కలిసి తమ అమ్మమ్మ వాళ్లింటికి వచ్చింది.ఆదివారం సాయంత్రం వాళ్లు ఇంట్లో ఉన్న వాటర్ మిలన్ తిన్నారు. కొద్దిసేపట్లోనే వాటర్ మిలన్ తిన్న పిల్లలకు వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. ఆ వెంటనే శ్వాస సంబంధిత సమస్యలు ఎదురయ్యాయి. అందులో అఖిలేష్ దివార్ (15) తీవ్ర అనారోగ్య సమస్యని ఎదుర్కొన్నాడు. వెంటనే ఆ బాలుడిని కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మిగతా ముగ్గురు పిల్లలు శ్రీ దివార్ (4), పింటూ దివార్ (12), హితేష్ దివార్ (13) కూడా ఇవే సమస్యలు ఎదుర్కొన్నారు. వెంటనే వీరిని కూడా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అయితే, వీరిలో అఖిలేష్.. ఆస్పత్రికి వెళ్లేలోపే ప్రాణాలు కోల్పోయారని వైద్యులు తెలిపారు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ వాటర్ మిలన్ ఉదయం కోశారు. ఆ రోజు సాయంత్రం తిన్నారు. ఈ క్రమంలో ఆ వాటర్ మిలన్ విషతుల్యం అయ్యుండొచ్చని అనుమానిస్తున్నారు. మరణించిన బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పిల్లలు తిన్న వాటర్ మిలన్ శాంపిల్స్‌ను అధికారులు సేకరించారు. అలాగే, కొయ్యకుండా ఉంచిన ఇంకో వాటర్ మిలన్‌ను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం చిన్నారులకు వైద్య చికిత్స కొనసాగుతోంది. పూర్తి దర్యాప్తు తర్వాతే పిల్లల మరణాలకు కారణాలు తెలుస్తాయని అధికారులు, పోలీసులు తెలిపారు.

## పాకిస్థాన్ ఎయిర్‌ఫీల్డ్స్‌లో ఇరాన్ సైనిక విమానాలు..


### -అమెరికా మీడియాలో కథనాలు..!



న్యూఢిల్లీ మే 12 (నేటి దర్శిని) పాకిస్థాన్ కు చెందిన ఎయిర్‌ఫీల్డ్స్‌లో ఇరాన్ సైనిక విమానాలను రహస్యంగా దాచి ఉంచినట్లు అమెరికా మీడియా (ఖూ వీవసఋ) లో సంచలన కథనాలు వెలువడ్డాయి. పాకిస్థాన్.. ఒకవైపు అమెరికా-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు మధ్యవర్తిత్వం వహిస్తూనే మరోవైపు ఇరాన్ సైనిక విమానాలను దాచేందుకు తమ ఎయిర్‌ఫీల్డ్స్‌లో చోటు ఇచ్చిందనే వార్తలు వెలువడటం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇటీవల అమెరికా-ఇరాన్ ఘర్షణల సమయంలో ఇరాన్ సైనిక విమానాలను తమ ఎయిర్‌ఫీల్డ్స్‌లో నిలిపి ఉంచేందుకు పాకిస్థాన్ రహస్యంగా అనుమతించిందని అమెరికా మీడియాలో కథనాలు వెలువడ్డాయి.అమెరికా మీడియా కథనాల ప్రకారం.. ఇరాన్ సైనిక ఆస్తులతో సహా అనేక విమానాలను రావల్పిండిలోని పాకిస్థాన్ ఆర్మీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లో నిలిపిఉంచారు. లాక్‌హీడ్ సి-130 హెర్క్యులస్ రవాణా విమానం, ఇరాన్ వైమానిక దళానికి చెందిన ఆర్‌సీ-130తో సహా పలు విమానాలు అక్కడ ఉన్నాయి. అమెరికా దాడుల నుంచి తమ వైమానిక, సైనిక ఆస్తులను రక్షించుకోవడంలో భాగంగా ఇరాన్ ఇలా చేసి ఉండవచ్చని ఆ కథనాలు పేర్కొన్నాయి. అదేవిధంగా టెహ్రాన్‌కు చెందిన ఓ పౌర విమానాన్ని అఫ్గానిస్థాన్‌లో నిలిపిఉంచినట్లు అమెరికా మీడియా తన కథనాల్లో పేర్కొన్నది. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి యూఎస్ మీడియా కథనాలను ఖండించారు. నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ ప్రజలు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతంలో ఉందని, కాబట్టి ఇలాంటి కార్యకలాపాలు అక్కడ రహస్యంగా జరగడం సాధ్యం కాదని స్పష్టంచేశారు. ఇక ఘర్షణ ప్రారంభం కావడానికి ముందు మహాన్ ఎయిర్‌కు చెందిన ఒక ఇరాన్ పౌర విమానం కాబుల్‌లో దిగిందని అఫ్గాన్ పౌర విమానయాన అధికారి చెప్పారు. ఘర్షణలవల్ల ఇరాన్ తన గగనతలాన్ని మూసివేయడంతో విమానం ఇక్కడే ఉండిపోయిందని తెలిపారు. విమానాలను ఇతరదేశాలకు తరలించి దాచాల్సిన అవసరం ఇరాన్‌కు లేదని ఇరాన్ పేర్కొన్నది. ఈ వార్తలపై అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. ఒకవేళ ఇదే నిజమైతే యుద్ధం ముగింపు విషయంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ పాత్రను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

## 8000 కోట్ల ఖరీదైన విమానాన్ని అమ్మేయండి..

### ప్రధాని మోదీకి అవిముక్తేశ్వరానంద కౌంటర్



సోన్‌భద్ర మే12 (నేటి దర్శిని) పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని మోదీ కొన్ని పొదుపు సూచనలు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ పర్యటన సమయంలోఆయన బహిరంగ సభలో పాల్గొని కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలన్నారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు ఆపాలన్నారు. డీజిల్, పెట్రోల్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రజా రవాణా వ్యవస్థపై ఎక్కువగా ఆధారపడాలని సూచించారు. రాబోయే కరువు, దారిద్ర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ ఆ సూచన చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రధాని పొదుపు సూచనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.దుబారా ఖర్చులు చేయవద్దు అంటే ముందుగా ప్రధాని వినియోగించే సుమారు 8 వేల కోట్ల ఖరీదైన ఎయిర్ ఇండియా వన్ విమానాన్ని అమ్మేయాలని స్వామి అవిముక్తేశ్వరానంద అన్నారు. ఆ విమానానికి బదులుగా ఇంధనం తక్కువ ఖర్చు అయ్యే విమానాలను వాడాలని స్వామీజీ విమర్శించారు. ఖర్చులు తగ్గించుకోవాలని ప్రజలకు చెప్పడం కాదు, ముందుగా ఆ విమానాన్ని అమ్మేసేయాలని ఆయన అన్నారు. యూపీలోని సోన్‌భద్రతలో జరిగిన గోవిష్ట్ యాత్రలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పొదుపు అనేది అధికారంలో ఉన్న వ్యక్తుల నుంచే మొదలు కావాలని ఆయన అన్నారు. ధర్మం అనేది ఇంటి నుంచే మొదలు కావాలని అవిముక్తేశ్వరానంద అభిప్రాయపడ్డారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**మన్సూరాబాద్, మే 12 (నేటి దర్శిని):**
హనుమాన్ జయంతి సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్ మల్లికార్జున నగర్‌లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మొత్తం "శ్రీ ఆంజనేయం.. జై శ్రీరామ్" నామస్మరణతో మారుమోగింది. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పాటు వివిధ రకాల పుష్పాలతో అలంకరణలు వైభవంగా చేపట్టారు. హనుమాన్ చాలీసా పారాయణంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ మాట్లాడుతూ, గాలిపుత్రుడైన హనుమంతుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ కే. రవికుమార్, సెక్రటరీ కృష్ణారావు, చంద్రమౌళి, సుబ్రహ్మణ్యం, జితేందర్ రెడ్డి, దుర్గయ్య, భగవంతరావు, బి. యాదగిరి, సీత మనోహర్ రెడ్డి, ధర్మాధికారి రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఘనంగా హనుమాన్ జయంతి



**ఉమ్మడి వరంగల్, మే12(నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టణాల్లో ,గ్రామాల్లో హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మాలలు ధరించిన స్వాములు 41 రోజులు నిష్ఠతో పూజలు నిర్వహించి మంగళవారం ఇరుముడి ధరించి భద్రాచలం, కొండగట్టు దేవాలయాలకు వెళ్లి సమర్పించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు శ్రీ సీతారామ దేవాలయాలు, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం: ఎంపీ డా. కడియం కావ్య



**ఉమ్మడి వరంగల్, మే 12 (నేటి దర్శిని బ్యూరో):**
సీఎం సహాయనిధి పేదలకు ఓ వరం లాంటిదని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల 33 వేల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక అవసరాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతున్నదని తెలిపారు. అర్హులైన వారు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నారని ఎంపీ పేర్కొన్నారు. ప్రతి అర్హుడూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.



# మిడ్జిల్ గ్రామంలో బొడ్రాయి పండుగ ఘనంగా ఏడవ వార్షికోత్సవం





**మిడ్జిల్ ,మే 12, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ గ్రామంలోని (బొడ్రాయి)7.వ వార్షికోత్సవాన్ని మంగళవారం గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలశాలతో అభిషేకం, అర్చన, నైవేద్యం, తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున ఉన్న బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల నుంచి గ్రామాన్ని కాపాడాలని ప్రత్యేకంగా వేడుకున్నారు. ఈ సందర్భంగా కుంకు అర్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యడవల్లిలో మద్యం నియంత్రణకు చర్యలు తీసుకోవాలి: ఎసైకి సర్పంచ్ వినతి




**కనగల్ మే12 (నేటి దర్శిని):**
కనగల్ మండలం జి. యడవల్లి గ్రామంలో మద్యం విక్రయాలను అరికట్టాలని కోరుతూ గ్రామ సర్పంచ్ వెంకటేష్ గ్రామస్తులతో కలిసి స్థానిక ఎసై రాజీవ్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో అక్రమ బెల్ట్ షాపులు పెరుగుతున్న నేపథ్యంలో యువత మద్యానికి బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని మద్యరహిత గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్న ఆయన, అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. గ్రామస్తులు కూడా మద్యం నియంత్రణ కోసం సహకరిస్తామని తెలిపారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎసై రాజీవ్ రెడ్డి గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి



**కనగల్, మే 12 (నేటి దర్శిని):**
కనగల్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు మమత, కావ్యలకు నగదు పురస్కారాలు అందజేశారు. గ్రామ సర్పంచ్ నరసింహ, మురళీధర్‌లు విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతిని అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్య ద్వారానే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో గరిష్ట స్థాయికి చేరిన ఉష్ణోగ్రతలు....!

- ఎండ వేడిమి తట్టుకోలేక ఇళ్లకే పరిమితమైన ప్రజలు



**ఉమ్మడి వరంగల్, మీ 12 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లా లో ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఉక్కపోతతో ఇంటికే పరిమితం అవుతున్నారు. మధ్యాహ్నం వేళ ప్రజలు బయటకు రావాలంటే ఎండ వేడిమికి వణికిపోతున్నారు. ఈ సందర్భంగా రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరాయి .ములుగులో అత్యధికంగా 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. హనుమకొండ 41.9, జనగామ 41.5, జయశంకర్ భూపాలపల్లి 41 4, మహబూబాబాద్ 40.8, వరంగల్ 40 . 8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. మే నెలలో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటలకు సమయంలోపు ప్రజలు బయటకు రాకపోవడం మంచిదని ఆరోగ్యశాఖ హెచ్చరిస్తుంది. అత్యవసరమైతే ఎండలో ప్రయాణం చేయవలసి ఉంటే తలకు కాటన్ టవల్ ధరించి వెళ్లాలని, మంచినీరు తీసుకోవాలని తెలిపారు. ఉదయం 8 గంటలకే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడంతో ప్రజలు వణికి పోతున్నారు. ఇండ్లలో సైతం కూలర్లు వేసుకున్న వేడిగాలి రావడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెట్ల నీడల్లో కాలక్షేపం చేస్తున్నారు.

# పేద ప్రజల సొంతింటి కలను సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజ్

**● ఇందిరమ్మ ఇళ్ల 61 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే**



**ఉమ్మడి వరంగల్, మే12(నేటి దర్శిని బ్యూరో):** పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి పేద కుటుంబానికి గూడు , నీడ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. హన్మకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2, 46, 56, 64 డివిజన్ల పరిధిలోని 61 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే నాగరాజు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు అని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్య ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు దశల్లో మొత్తం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుందని వివరించారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత రూ. 1 లక్ష, గోడల నిర్మాణం అనంతరం రూ. 1 లక్ష, స్లాబ్ పూర్తయిన తర్వాత రూ. 2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన అనంతరం మరో రూ. 1 లక్ష నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఈ సహాయం గ్రీన్ చానల్ ద్వారా పారదర్శకంగా అందజేయబడుతుందని స్పష్టం చేశారు. ఇల్లు నిర్మాణం జరుగుతున్న సమయంలో ప్రతి లబ్ధిదారుడి ఇంటికి స్వయంగా వచ్చి పరిశీలిస్తానని, ఒక కుటుంబ సభ్యుడిలా అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎవరికైనా బ్యాంకు ఖాతాలు లేకపోతే తన సొంత ఖర్చుతో ఖాతాలు తెరవించేందుకు సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు అవసరమైతే ఆస్ట్రానిక్ కంపెనీ సహకారంతో ఇండ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరూ అధైర్యపడవద్దని, ప్రతి అర్హులైన లబ్ధిదారుడికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 2, 46, 56, 64 డివిజన్ల సంబంధించిన నాయకులు, కార్యకర్తలు , మహిళలు, యూత్ నాయకులు, లబ్ధిదారులు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పూర్తి మద్దతు కొనసాగుతుంది: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**● శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి అధ్యక్షుడు ,ఎమ్మెల్యే లు**



**ఉమ్మడి వరంగల్, మే 12(నేటి దర్శిని బ్యూరో):** హన్మకొండ జిల్లా దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో బొల్లం లక్ష్మణ్ – మంజుల ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, డీసీసీ అధ్యక్షులు , కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పూర్తి మద్దతు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు , గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**● చింతాల ఆంజనేయ స్వామి దేవాలయంలో దర్శించుకున్న భక్తులు**
**● ఆలయాలకు పోటెత్తిన భక్తులు,అన్న ప్రసాద వితరణ.**



**చండూరు, మే12 (నేటి దర్శిని):** చండూరు మున్సిపాలిటీలో అంగడిపేట గ్రామంలో శ్రీ చింతాల ఆంజనేయ స్వామి దేవాలయంలో లోని చింతాల ఆంజనేయస్వామి దేవాలయాన్ని హనుమాన్ జయంతి సందర్భంగా సర్వాంగ సుందరంగా పూల మాలలతో, మామిడి తోరణాలతో అలంకరించారు. ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం లో అర్చకులు కమిటీ ఆధ్వర్యంలో, చండూరులో పెరుమాళ్ళ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు , నిర్వహించారు. హనుమాన్ కి అభిషేకం, అర్చనలు, పుష్పార్చన పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. జై హనుమాన్ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం ఒక్కసారిగా దద్దరిల్లింది. అన్న ప్రసాదం ప్రజలు స్వీకరించి హనుమాన్ ఆశీస్సులు పొందారు. విచ్చేసిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే వేసవి తాకిడిని తట్టుకునేందుకు ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం దగ్గర చల్లని మజ్జిగ భక్తులకు అందచేసి దాహార్తిని తీర్చారు. విచ్చేసిన భక్తులు ఆలయ కమిటీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు భక్తులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు





**కొత్తపేట, మే12 (నేటి దర్శిని):** కొత్తపేట డివిజన్ నాగేశ్వరరావు కాలనీలోని శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని రాజ్‌కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ అంకతి, వైస్ చైర్మన్ సతీష్ జుట్టుకొండ, జనరల్ సెక్రటరీ రమేష్ గారేపల్లి, ట్రెజరర్ రవీందర్ రెడ్డి పుట్టతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు

**చండూరు,మే 12 (నేటి దర్శిని):** చండూరు మున్సిపల్ కేంద్రంలో చండూర్ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగ అభ్యాసన తరగతులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్ శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. యోగ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది తెలియజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు బాల సైదులు, పద్మజ, జ్యోతి, ప్రమీల, సంధ్య, సునీత, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




## పదవ తరగతి సమ్మర్ క్యాంప్ ను ప్రారంభించిన కలెక్టర్




**ఉమ్మడి వరంగల్, మే 12 ( నేటి దర్శిని బ్యూరో):** పరీక్షల్లో ఫెయిల్ కావడం అంటే జీవితంలో ఓడిపోవడం కాదని, విద్యార్థులు నిరుత్సాహపడకుండా పట్టుదలతో చదివి సప్లమెంటరీలో విజయం సాధించాలనివరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకాంక్షించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థుల కోసం ప్రభుత్వం సమ్మర్ క్యాంపులను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా వరంగల్ నగరంలోని కాశిబుగ్గ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపును మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్




**కొత్తపేట, మే12 (నేటి దర్శిని):** హనుమాన్ జయంతి సందర్భంగా కొత్తపేట డివిజన్ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర కాలనీ మరియు మారుతి నగర్‌లో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కొత్తపేట మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామి వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎల్బీనగర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వరావు, బీజేపీ నాయకులు వగ్గుల సుందర్ నారాయణ, వెంకట్ రెడ్డి, తిరుమల తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**నాగోల్‌మే 12 (నేటి దర్శిని):** హనుమాన్ జయంతి సందర్భంగా నాగోల్ డివిజన్ పరిధిలోని రామాలయం దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి ఆంజనేయ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆంజనేయ స్వామివారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, చంద్రశేఖర్ అజాద్ తదితరులు

# డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి




**నిడమనూరు, మే 12 (నేటి దర్శిని):** నిడమనూరు గ్రామానికి చెందిన కన్నెబోయిన గణేష్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గణేష్ ముకుందపురం గ్రామంలోని రేఖ వెంకటరమణ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి బైక్‌పై వెళ్లి తిరిగి నిడమనూరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ముకుందపురం గ్రామం సమీపంలోని ఎన్‌హెచ్–167 మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గణేష్ తలకు తీవ్ర రక్తగాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే మార్గమధ్యలోనే అతను మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి వివాహం జరిగినట్లు సమాచారం. మృతుడి తండ్రి కన్నెబోయిన సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉప్పు సురేష్ తెలిపారు.

# బిజినెస్

## భారత ఆర్థిక వృద్ధికి డబుల్ సెగ

**జిడిపి 6 శాతమే : హెచ్ఎస్‌బిసి అంచనా**

**ముంబయి**




అంతర్జాతీయ ఇంధన సంక్షోభం, దేశీయంగా వర్షపాత లేమి భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని ప్రముఖ అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ హెచ్ఎస్‌బిసి హెచ్చరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సం 2026-27నకు సంబంధించి భారత వాస్తవిక జిడిపి రేటు అంచనాను గతంలో ప్రకటించిన 7.4 శాతం నుండి ఏకంగా 6 శాతానికి కోత పెట్టింది. ?ఇది ఆర్థిక వ్యవస్థలో ప్రమాద ఘంటికలను స్పష్టం చేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ గత నెలలో జిడిపి వృద్ధిని 6.9 శాతంగా అంచనా వేయగా.. హెచ్ఎస్‌బి అంతకంటే తక్కువగా ఉంటుందని చెప్పడం ఆందోళకరం. రాబోయే రోజుల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అంతర్జాతీయ చమురు రాజకీయాలు భారత ఆర్థిక భవిష్యత్తును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించనున్నాయని ఆ సంస్థ తెలిపింది. హెచ్ఎస్‌బిసి నివేదిక ప్రకారం.. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైనే కొనసాగుతుండటం దేశ ఆర్థిక గమనాన్ని దెబ్బతీస్తోంది. దీనికి తోడు ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి వాతావరణ మార్పులు ఆహార ద్రవ్యోల్బణాన్ని పెంచేలా కనిపిస్తున్నాయి. ఈ బహుళ సవాళ్ల కారణంగా గ్రామీణ కుటుంబాలు, చిన్న తరహా పరిశ్రమలు, వ్యవస్థీకృత రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని నివేదిక పేర్కొంది.

**వడ్డీ రేట్లు పెరగొచ్చు..**

ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉండటంతో దానిని అదుపు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కఠిన నిర్ణయాలు తీసుకోవచ్చని హెచ్ఎస్‌బిసి విశ్లేషించింది. ముఖ్యంగా డిసెంబర్, మార్చి త్రైమాసికాల్లో ఆర్‌బిఐ రెండుసార్లు వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందని అంచనా వేసింది. చమురు కంపెనీల నష్టాలను పూడ్చేందుకు పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.7 వరకు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని పేర్కొంది. ఇది కూడా ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తుందని హెచ్చరించింది.

## వరుసగా 4రోజు తగ్గిన బంగారం, వెండి ధరలు.. తులం ఎంతుందంటే?

అంతర్జాతీయ ఉద్రిక్తతలు, రూపాయి విలువ మారకంతో బంగారం, వెండి ధరల్లో ఎప్పటికప్పుడూ మార్పులు వస్తుంటాయి. దానికితోడు తాజాగా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో బంగారం కొనొద్దని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు కూడా వాటి షేర్లపై భారీ ప్రభావం చూపాయి. మోదీ వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే మార్కెట్‌లో బంగారం షేర్లు భారీగా కుప్పకూలాయి. దీంతో బంగారం ధరల్లో కూడా మార్పులు రానున్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే గత నాగులు రోజులుగా బంగారం, వెండి ధరలు వరుసగా తగ్గుతనూనే వస్తున్నాయి. కాబట్టి మంగళవారం తెలుగు రాష్ట్రాల సహా దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.

ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,120 గా ఉండగా నిన్న ఈ ధర 1,52,234గా ఉంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రామల బంగారం ధర చూసుకుంటే ప్రస్తుతం రూ.1,39,440 గా ఉండగా నిన్న ఈ ధర 1,39,640 గా ఉంది. ఇక ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో వెండి ధర చూసుకుంటే కేజీ వెండి ధర రూ.2,74,800 వద్ద



ట్రేడవుతుంది.

ఇక దేశ వ్యాప్తంగా ప్రధాన నగారల్లో బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,52,120గా ఉండగా నిన్న ఈ ధర 1,39,440 గా ఉంది. 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర
రూ.1,39,640 ఉంది. వెండి కిలో ధర రూ.2,74,800గా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,52,120, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,440 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,52,120, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,440 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,52,120, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,440 ఉంది.

కోల్‌కత్తాలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,52,120, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,440 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,53,810,గా ఉండగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,990గా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,52,270, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ1,39,590 వద్ద కొనసాగుతుంది.ఇక వెండి వెండి ధరలు చూసుకుంటే దేశీ మార్కెట్‌లో కేజీ వెడి ధర రూ.రూ.2,74,800 గా ఉండగా హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2,85,100 గా ఉంది

## హెరిటేజ్ ఫుడ్స్ ప్రాఫిట్ డౌన్

**న్యూఢిల్లీ,**

హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో సంస్థ రూ.23.94 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.38.16 కోట్ల లాభంతో పోలిస్తే 37 శాతం తగ్గింది.నిర్వహణ ఖర్చులు అధికమవడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయంరూ.1,157.56 కోట్లకు ఎగబాకింది.

# స్పోర్ట్స్

## టిమ్ డేవిడ్‌కు భారీ జరిమానా..

ఐపీఎల్ లో గెలుపోటములు సహజమే అయినా, ఆటగాళ్ల ప్రవర్తన అనేది చాలా ముఖ్యం. ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగిన మ్యాచ్ లో ఆర్సీబీ ప్లేయర్ టిమ్ డేవిడ్ హద్దులు దాటి ప్రవర్తించాడు. ఈ మ్యాచ్ లో అతను డకౌట్ అయినప్పటికీ, డగౌట్ లో కూర్చుని తన టీమ్ ను ఉత్సాహపరిచాడు. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత అతను చేసిన ఒక అభ్యంతరకరమైన సైగ కెమెరాలకు చిక్కింది. గతంలో ముంబై ఇండియన్స్ కు ఆడిన డేవిడ్, ఇప్పుడు అదే టీమ్ పై గెలిచిన జోష్ లో తన ఫీలింగ్స్ ను కంట్రోల్ చేసుకోలేకపోయాడు. టిమ్ డేవిడ్ ప్రవర్తన ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.6ను ఉల్లంఘించినట్లు మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ నిర్ధారించారు. ఇది అశ్లీలమైన లేదా అభ్యంతరకరమైన సైగగా పరిగణిస్తూ, అతని మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా వేశారు. టిమ్ డేవిడ్ కూడా తన తప్పును ఒప్పుకోవడంతో వివాదం సర్దుమణిగింది. కానీ స్టార్ ఆటగాళ్లు ఇలాంటి పనులు చేయడం ఫ్యాన్స్ ను కాస్త నిరాశకు గురిచేసింది.ఈ మ్యాచ్ ఆద్యంతం నరాలు తెగే ఉత్కంఠతో సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ 166 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆరంభంలోనే షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సున్నాకే వెనుదిరగగా, దేవదత్ పడిక్కల్ 12



పరుగులకే అవుట్ అయ్యాడు. కెప్టెన్ రజత్ పాటిదార్ కూడా 8 పరుగులకే వెనుదిరగడంతో ఆర్సీబీ 39 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో కృనాల్ పాండ్యా ఇన్నింగ్స్ ను చక్కదిద్దాడు. క్రాంప్స్ (కండరాలు పట్టేయడం) ఇబ్బంది పెడుతున్నా లెక్కచేయకుండా 46 బంతుల్లో 5 సిక్సర్లు, 4 ఫోర్లతో 73 పరుగులు చేసి జట్టును విజయానికి దగ్గరగా తీసుకెళ్లాడు. బౌలింగ్ లో 4 వికెట్లు తీసి ముంబైని దెబ్బకొట్టిన భువనేశ్వర్ కుమార్, బ్యాటింగ్ లోనూ మెరిశాడు. ఆఖరి ఓవర్లో విజయానికి 15 పరుగులు కావాల్సిన సమయంలో భువీ ఒక సిక్సర్ బాది ఒత్తిడి తగ్గించాడు. చివరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా, ఆర్సీబీ ఆ పరుగులు తీసి థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేసింది. ముంబై బౌలర్లలో కార్బిన్ బాష్ 4 వికెట్లతో చెలరేగినా ఫలితం లేకపోయింది. ఈ విజయంతో ఆర్సీబీ 14 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లగా, డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ లీగ్ నుంచి నిష్క్రమించింది. మ్యాచ్ 18వ ఓవర్లో నమన్ ధీర్, తిలక్ వర్మ మధ్య జరిగిన మిస్ కమ్యూనికేషన్ వల్ల కృనాల్ పాండ్యా ఇచ్చిన క్యాచ్ మిస్ అయింది. ఆ ఛాన్స్ ను వాడుకున్న కృనాల్ వరుస సిక్సర్లతో మ్యాచ్ ను మలుపు తిప్పాడు. చివర్లో టిమ్ డేవిడ్ సున్నాకే అవుట్ అయినా, భువీ ఫినిషింగ్ టచ్ తో బెంగళూరు గెలిచింది. ఓవరాల్ గా ఈ మ్యాచ్ ఒక రోలర్ కోస్టర్ రైడ్ లా సాగింది. ఇటు ఆట పరంగా, అటు వివాదాల పరంగా ఈ సండే మ్యాచ్ క్రికెట్ లవర్స్ కు మంచి మసాలా అందించింది.


## మరో వివాదంలో షాహీన్ షా అఫ్రిది

పాకిస్థాన్ పేసర్ షాహీన్ షా అఫ్రిది మరో వివాదంలో చిక్కుకున్నాడు. రెండు టెస్టల సిరీస్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో ఢాకా వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో షాహీన్ అఫ్రిది బాల్ టాంపరింగ్‌కు ప్రయత్నిస్తూ టీవీ కెమెరాలకు చిక్కాడు. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. బౌలింగ్ చేసే సమయంలో అఫ్రిది.. బంతిని తన షూస్ కింద వేసి బలంగా నొక్కే ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని గమనించిన అంపైర్ వెంటనే బంతిని చెక్ చేసి.. ఆకారం దెబ్బతినకపోవడంతో బౌలింగ్‌కు అనుమతిచ్చాడు. దాంతో అఫ్రిది ఆ ఓవర్‌ను పూర్తి చేశాడు. అయితే ఈ వీడియో నెట్టింట వైరల్ కాగా.. అఫ్రిదిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాల్ టాంపరింగ్‌కు ప్రయత్నించిన అతనిపై మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ఫకార్ జమాన్ బాల్ టాంపరింగ్‌కు



ప్రయత్నించి దొరికిపోయాడు. అతనిపై నిర్వాహకులు భారీ జరిమానా విధించారు. ఈ ఘటనను మరిచిపోకముందే మరో పాక్ ఆటగాడు బాల్ టాంపరింగ్‌కు యత్నించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయం దిశగా సాగుతోంది. 268 పరుగుల లక్ష్యంతో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన పాకిస్థాన్ 121 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో సౌద్ షకీల్, మహమ్మద్ రిజ్వాన్ ఉన్నారు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 413 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ షాంటో (101), మోమినుల్ హక్ (91), ముష్ఫికర్ రహీమ్ (71) రాణించారు. పాకిస్థాన్ బౌలింగ్‌లో మహ్మద్ అబ్బాస్(5/92) ఐదు వికెట్లు తీయగా.. షాహీన్ షా అఫ్రిది 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 386 పరుగులకు ఆలౌటైంది. ఇమామ్-ఉల్-హక్ (120), అబ్దుల్లా ఫజల్ (120) శతకాలతో రాణించారు. 27 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ 240/9 స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. నజ్ముల్ హుస్సేన్ షాంటో (87), మోమినుల్ హక్ (56) రాణించారు.

## చాలా మంది నా మసిల్స్‌పై కామెంట్లు చేశారు




భారత మహిళల క్రికెట్ స్టార్ స్మృతి మంధానా

ఈమధ్య ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్మృతి మంధానా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒకసారి తాను చేతులు స్పష్టంగా కనిపించే డ్రెస్ వేసుకున్నానని తెలిపింది. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత చాలా మంది తన మసిల్స్‌పై కామెంట్లు చేశారని చెప్పింది.అథ్లెట్‌గా ఉండే వ్యక్తికి మసిల్స్ ఉండటం సాధారణమని, అది గర్వపడాల్సిన విషయమని స్మృతి తెలిపింది. "మేము ఫిట్‌గా ఉండేందుకు జిమ్‌లో చాలా కష్టపడతాం. మహిళా క్రీడాకారిణులు ప్రతిరోజూ ట్రైనింగ్ తీసుకుంటారు. శరీరం బలంగా ఉండాలి. ఫిట్‌నెస్‌ను ప్రశంసించాలి కానీ ట్రోల్ చేయకూడదు" అని ఆమె చెప్పింది.నాకు మంచి మసిల్స్ ఉన్నాయని కూడా ట్రోల్ చేశారు. అది చాలా ఫన్నీ విషయం" అని స్మృతి నవ్వుతూ చెప్పింది. ఆమె వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున మద్దతు లభించింది. చాలా మంది అభిమానులు ఆమె ధైర్యాన్ని ప్రశంసించారు.మహిళా అథ్లెట్లను వారి ప్రతిభ కంటే రూపం ఆధారంగా ఎక్కువగా జడ్జ్ చేస్తారని కొందరు నెటిజన్లు కామెంట్లు చేశారు. పురుష క్రికెటర్ల విషయంలో ఇలాంటి ట్రోలింగ్ చాలా తక్కువగా ఉంటుందని కూడా అభిప్రాయపడ్డారు. ఇది స్మృతి మంధానాకు మొదటిసారి ఎదురైన ట్రోలింగ్ కాదు. గతంలో బెంగళూరులో జరిగిన ఒక ఈవెంట్‌లో తీసిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అప్పట్లో కూడా కొందరు ఆమె రూపంపై నెగటివ్ కామెంట్లు చేశారు. అయితే అభిమానులు మాత్రం ఆమెకు బలంగా మద్దతుగా నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో రికార్డులు సృష్టించిన స్మృతి మంధానా ప్రస్తుతం మహిళల క్రికెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ఆటగాళ్లలో ఒకరిగా కొనసాగుతోంది.

నేటి దర్శిని
WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...


## వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త

### రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ




మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టుకోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



## వైట్ డ్రెస్ లో ఏంజెల్ లా నిధి అగర్వాల్

## ఎన్టీఆర్ -నీల్ ప్రాజెక్ట్ మూవీ

### మే 19న అర్ధరాత్రి గ్లింప్స్ విడుదల



జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎన్టీఆర్-నీల్' ప్రాజెక్ట్ నుంచి అదిరిపోయే అప్డేట్ రాబోతోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కెజిఆఎఫ్, 'సలార్' సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మాస్ యూనివర్స్‌ను సృష్టించిన ప్రశాంత్ నీల్, ఇప్పుడు తారక్‌ను ఎలా చూపించబోతున్నాడోననే ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను తారక్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో మే 20న అభిమానులకు భారీ ట్రీట్ ఖాయమని అందరూ భావించారు. అయితే ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, అభిమానుల ఉత్కంఠను మరింత పెంచేలా మేకర్స్ ఒక రోజు ముందుగానే గ్లింప్స్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంటే మే 19 అర్ధరాత్రి 12 గంటలకే ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదల కానున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అర్ధరాత్రి నుంచే సోషల్ మీడియాలో తారక్ ఫ్యాన్స్ సంబరాలు మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చిన్న చిన్న లీక్స్, సెట్స్ ఫోటోలు అభిమానుల్లో భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు ఫస్ట్ గ్లింప్స్‌తో ప్రశాంత్ నీల్ సృష్టించిన కొత్త ప్రపంచం ఎలా ఉండబోతుందో చూడాలని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మే 18న రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటంతో సోషల్ మీడియాలో ఇప్పటికే మెగా అభిమానుల హంగామా మొదలైంది. ఇక దానికి మరుసటి రోజే తారక్ గ్లింప్స్ రావడంతో మెగా-నందమూరి అభిమానుల మధ్య సోషల్ మీడియా వార్ పీక్స్‌కు చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తారక్ నుంచి వస్తున్న ఈ భారీ సోలో ప్రాజెక్ట్ కావడంతో ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక మే 19 అర్ధరాత్రి విడుదలయ్యే గ్లింప్స్‌లో తారక్ లుక్, క్యారెక్టర్, సినిమా బ్యాక్‌డ్రాప్‌పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.



## అలా అంటే నేను ఒప్పుకోను!

తెలుగమ్మాయి శ్రీలీలకు తమిళంలోనూ మంచి క్రేజే ఉంది. రీసెంట్‌గా 'పరాశక్తి' సినిమాతో తమిళ ప్రేక్షకుల్ని పలకరించింది శ్రీలీల. ఆ సినిమా ఫలితం ఎలా ఉన్నా.. ఈ తెలుగందానికి మాత్రం మంచి గుర్తింపే దక్కింది. రీసెంట్‌గా ఓ తమిళ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నేను డాక్టర్‌ని. అనుకోకుండా యాక్టర్‌ని కూడా అయ్యాను. ఈ రెండూ నాకు గర్వకారణాలే. ఈ క్రెడిట్ మా అమ్మవల్లే నాకు దక్కింది. జీవితంలో జయాపజయాలు సహజం.అపజయం ఎదురైనప్పుడు ఓ గంట ఏడుస్తాను. తర్వాత 'నెక్ట్స్' అంటూ రెడీ అయిపోతా. ప్రస్తుతం తెలుగు, తమిళంతో పాటు ఇప్పుడు హిందీలోనూ నటిస్తున్నా. అక్కడ నన్ను కొందరు లేడీ సూపర్‌స్టార్ అంటున్నారు. దానికి నేను ఒప్పుకోను. లేడీ సూపర్‌స్టార్ అంటే మా అక్క నయనతార మాత్రమే. నయన్ మాదిరిగా నేనూ తమిళం అబ్బాయినే పెళ్లాడతానేమో!' అంటూ చెప్పుకొచ్చింది శ్రీలీల. ఇంకా చెబుతూ 'విమానప్రయాణం చేసేటప్పుడు ల్యాండింగ్ అంటే నాకెంతో భయం. ల్యాండయ్యాక పైలెట్, ఇతర యూనిట్ మొత్తానికి షేక్‌హ్యాండిచ్చి ధన్యవాదాలు చెప్పాలని అమ్మ చెబుతుండేది. దాన్ని తూచ తప్పక పాటిస్తుంటా' అంటూ గుర్తు చేసుకున్నది శ్రీలీల. ప్రస్తుతం ఆమె ధనుష్‌కు జోడీగా ఓ సినిమాలో నటిస్తున్నది.

## కమల్-రజనీ మూవీలో త్రిష



తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365